"కాదు. ఏ మనిషికైనా తన ప్రాణాలకి మించింది ఇంకోటి వుండదు. కాబట్టి నా ప్రాణాలని కాపాడిన మిత్రుడ్ని ఎక్కించుకుంటాను." రెండో వర్గం వాళ్ళు చెప్పారు.

"మన తల్లిని నిర్లక్ష్యం చేయకూడదు. ఆవిడనే ఎక్కించుకుంటాను." మూడో వర్గం వారు చెప్పారు.

హరిదాసు తమలో ఎవరు కరెక్ట్ అని చెప్తాడా అని మూడు వర్గాల వారు ఆసక్తిగా ఆయన జవాబు కోసం ఎదురు చూసారు.

"మీ మూడు వర్గాల్లో ఎవరూ స్వర్గానికి వెళ్ళరు." చెప్పాడు హరిదాసు.

"అదేం?" నివ్వెరపోతూ ప్రశ్నించారు వాళ్ళు.

"ముసలావిడని హాస్పిటల్‌కి తీసుకెళ్ళమని చెప్పి, కారు తాళం చెవిని మీ మిత్రుడికి ఇచ్చి, మీ తల్లితో బస్‌లో వెళ్ళేవారినే దేవుడు స్వర్గానికి అనుమతించేది. మనం మన స్వార్థం అనే గిరిలోంచి బయటకి వస్తే తప్ప స్వర్గానికి అర్హులం కాము. ఇదే అసలైన నిష్కామ సేవ అంటే." వివరించాడా హరిదాసు.

## 5. అనుకూల దృష్టి

ఓ రోజు ఓ కాషాయాంబరధారి ఓ గ్రామంలోని ఓ ఇంటి ముందాగి అరిచాడు.

"భవతీ! భిక్షాందేహి."

ఆ ఇంట్లోంచి సిగ్గుపడుతూ బయటకి వచ్చిన ఓ ఇల్లాలు అడిగింది.

"ఇంకా వంట కాలేదు. నువ్వెక్కడ ఉంటావో చెప్తే నేనే తెచ్చి ఇస్తాను."

"హనుమంతుడి గుడిలో."

వంట పని చేస్తూ చేతిలో వేడి పాత్రని పట్టుకోడానికి తీసుకున్న పాత బట్టతో వచ్చిన ఆమె యధాలాపంగా తన చేతిలోని బట్టని ఆ సన్యాసికి ఇచ్చేసింది. కొద్దిసేపటికి వంటయ్యాక దాన్ని గిన్నెల్లో సర్దుకుని బుట్టలో వాటిని ఆమె హనుమంతుడి గుడికి తీసుకెళ్ళింది. దారిలో తను అలుకు గుడ్డని అతనికి ఇచ్చిన సంగతి ఆమెకి స్ఫురించింది.

హనుమంతుడికి దీపాలు వెలిగిస్తున్న ఆ సాధువుకి అన్నం వడ్డించాక బాధ పడుతూ చెప్పింది.

"మన్నించు తండ్రీ! ఇందాక పొరబాటున ఇల్లు తుడిచే గుడ్డని నీ చేతిలో పెట్టాను. అదిస్తే వెళ్ళేప్పుడు తీసుకువెళ్తాను."

"ఇంకెక్కడి గుడ్డ? ఐనా మన్నించడం దేనికి? మంచి పనే చేసావుగా? దాన్ని బాగా ఉతికి ఆరేసి, వత్తులు చేసి స్వామివారికి దీపాలు వెలిగించేసాను." చెప్పాడు సాధువు.

ఆ సాధువులా మనం ఈ ప్రపంచంలో దేన్నీ వ్యతిరేక దృష్టితో కాకుండా, అనుకూల దృష్టితో చూడగలగడం సరైన ఆధ్యాత్మికత.

## 6. ఆరు రూపాయలు

ఓ ఊళ్ళో రాముడ్ని కొలిచే వెంకట్రావు అనే ఓ భక్తుడు ఉండేవాడు. అయితే అతను బంగారం పట్టినా మట్టయ్యేది. దాంతో దరిద్రాన్ని అనుభవించే వాడు.

ఓ రోజు అతని భార్య అతనికి ఓ సలహా ఇచ్చింది.

"రాముడ్ని మన దరిద్రం తీర్చమని ప్రార్థించరాదూ? ఆయన మీ కోరిక తప్పక తీరుస్తాడు."

"పిచ్చిదానా! మనకేం కావాలో ఆయనకి తెలీదా? అందుకు నేనాయనకి సూచనలు ఇవ్వలేను." అతను ఒప్పుకోలేదు.

ఆ రాత్రి శ్రీరామచంద్రమూర్తి అతనికి కల్లో కనబడి చెప్పాడు.

"నీ ఇంట్లోని గూట్లో ఆరు రూపాయలు ఉన్నాయి కదా? అవి తీసుకుని రేపు సాయంత్రానికల్లా నువ్వు పెద్ద బజారుకి వెళ్ళు. అక్కడ ఆ ఆరు రూపాయలకి నీకు ఇష్టమైంది ఏది కనబడితే అది కొను. నీ దరిద్రం తీరుతుంది."

ఉదయం నిద్రలేవగానే తన భార్యకి ఆ కల గురించి చెప్పాడు.

"ఆయన చెప్పినట్లు చేయండి. ఒకవేళ అది ఉత్తుత్తి కలే అయినా ఖర్చయ్యేది ఆరు రూపాయలే కదా." సలహా ఇచ్చింది భార్య.